క్లుప్తంగా

పేదలకు అన్నదానం

సంతనూతలపాడు: సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పేదలకు అన్నదానం చేశారు. వరుసగా 29వ వారం ఎన్నారై ట్రస్ట్ ఫౌండర్ పాతూరి సంపత్ ధర్మపత్ని సంధ్యారాణి పుట్టినరోజు సందర్భంగా 200 మందికి అన్నదానం చేశారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ పావులూరి నారాయణస్వామి చౌదరి, జాయింట్ సెక్రటరీ కంకణంపాటి వెంకటేశ్వర్లు, ట్రస్ట్ సభ్యులు శీలం మల్లారెడ్డి, కొప్పోలు శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, కురిచేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కళా ఉత్సవ్‌లో సంతనూతలపాడు విద్యార్థుల ప్రతిభ



విజేతలైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

సంతనూతలపాడు: స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు కళా ఉత్సవ్ పోటీల్లో సత్తాచాటారు. మైనంపాడు డైట్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో రిషిత, నవదుర్గ, జాహ్నవి మొదటి స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో నవదుర్గ ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచింది. వీరికి సమన్వయకర్తగా స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్) వజ్రాల మాధవీలత వ్యవహరించారు. వీరిని స్కూల్ హెచ్ఎం ప్రమోద, ఉపాధ్యాయులు అభినందించారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి



పీడీకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

ఒంగోలు టౌన్: అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, సమ్మె హామీలు నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ డిమాండ్ చేశారు. జిల్లాలో అంగన్‌వాడీల సమస్యలపై జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. నగరంలోని యూనియన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటాలు చేస్తూనే ఉంటామని చెప్పారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ కేంద్రాలుగా మారుస్తామన్న హామీ నెరవేర్చాలని కోరారు. అనంతరం ప్రాజెక్టు డైరెక్టర్ హెనా సుజన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.రమేష్, ఎం.ధనలక్ష్మి, జయప్రద, క్రాంతికుమారి, మల్లేశ్వరి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీడీగా బాధ్యతలు చేపట్టిన హేన సుజన్



పీడీగా బాధ్యతలు చేపట్టిన హేన సుజన్

ఒంగోలు సిటీ: జిల్లా ఐసీడీఎస్ పీడీగా హేన సుజన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు ఇన్‌చార్జ్ పీడీ గా పనిచేస్తూ ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. డీసీపీఓ దినేష్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి పీడీకి అభినందనలు తెలిపారు. జిల్లాలోని సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు కలిసి అభినందనలు తెలిపారు.

15న చెట్లతో చెలిమి వ్యాస సంపుటి ఆవిష్కరణ

ఒంగోలు మెట్రో: నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ కందేపి రాణీప్రసాద్ రచించిన బాలల సైన్స్ వ్యాస సంపుటి చెట్లతో చెలిమి పుస్తకావిష్కరణ సభను స్థానిక ఎంసీఏ భవన్లో ఈ నెల 15వ తేదీ ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డా.నాగభైరవ ఆదినారాయణ, పుస్తకావిష్కర్తగా డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారిణి పాకల ఝాన్సీరాణి, విశిష్ట అతిథులుగా కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, ప్రరవే జాతీయ కమిటీ సభ్యురాలు పి.రాజ్యలక్ష్మి, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు పాల్గొంటారని తెలిపారు. సభ అనంతరం ఆహ్వానకవి సమ్మేళనం జరుగుతుందని, కవులు, రచయితలు, కళాకారులు పాల్గొని సభను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఉచిత బస్సు లేదా బాబూ..!

- ఎన్నికల హామీ అమలు చేయకపోవడంపై మహిళల ఆగ్రహం
- అధికారం చేపట్టి ఆరు నెలలు దాటినా అతీగతీ లేదంటూ విమర్శలు
- చంద్రబాబు అబద్ధపు హామీలు నమ్మి ఓట్లేసి మోసపోయామంటూ గగ్గోలు
- సంతనూతలపాడు నియోజకవర్గంలో 1,08,724 మంది మహిళా ఓటర్లు



చీమకుర్తి రూరల్: 'ఏరు దాటేదాకా ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న' అన్నట్లుంది కూటమి ప్రభుత్వ పాలకుల తీరు. ఎన్నికల సమయంలో సూపర్–6 హామీలంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఆ హామీలు నమ్మి ప్రజలు ఓట్లు వేయడంతో అధికారంలోకి వచ్చారు. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు దాటినా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు. సూపర్–6లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీని అటకెక్కించడంపై సంతనూతలపాడు నియోజకవర్గంలో మహిళలు పెదవి విరుస్తున్నారు. అధికారం చేపట్టిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ ఎన్నికల వేళ ఊదరగొట్టిన కూటమి పార్టీల నాయకులు.. ప్రస్తుతం దాని గురించి ఏమీ మాట్లాడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఉత్తిదేనా చంద్రబాబూ అంటూ సీఎంను ప్రశ్నిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 16,82,684 మంది మహిళా ఓటర్లు...

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు, కనిగిరి, దర్శి, యర్రగొండపాలెం, మార్కాపురం, చీరాల, పర్చూరు, కందుకూరు, గిద్దలూరు, అద్దంకి నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు భారీగా ఉన్నారు. తాజా లెక్కల ప్రకారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 33,97,448 మంది ఓటర్లు ఉండగా, వారిలో 16,82,684 మంది మహిళలు ఉన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో 2,13,731 మంది ఓటర్లు ఉండగా, వారిలో 1,08,724 మంది స్త్రీలు ఉన్నారు. చీమకుర్తి మండలంలో 61,250 మంది ఓటర్లు ఉండగా, వారిలో 30,765 మంది స్త్రీలు ఉన్నారు. మహిళలకు ఉచిత బస్సు హామీ అమలు చేస్తే వీరందరికీ లబ్ధి చేకూరే అవకాశం ఉంది. కానీ, ఎన్నికల సమయంలో కేవలం మహిళా ఓటర్లను ఆకర్షించేందుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీ ఇచ్చిన కూటమి నాయకులు.. ప్రభుత్వం ఏర్పాటయ్యాక అమలు చేయకుండా మోసం చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆర్టీసీ ఆధ్వర్యంలో జిల్లాలోని 75 శాతం రూట్లలో గ్రామీణ ప్రాంతాలకు సైతం సేవలందిస్తున్నారు. మహిళలు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సుల్లో నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత బస్సు హామీ అమలు చేయకపోవడంతో తామంతా నష్టపోతున్నామని మహిళలు మండిపడుతున్నారు.

కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలి



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని కూటమి నేతలు ఇచ్చిన హామీ ఇప్పటి వరకు పట్టాలెక్కలేదు. పక్క రాష్ట్రాల్లో అధికారం చేపట్టిన వెంటనే అక్కడి ప్రభుత్వాలు ఉచిత బస్సు హామీని పక్కాగా అమలు చేశాయి. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం అమలు చేస్తే మహిళలకు కొంత మేర ఊరట కలుగుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ హామీపై మహిళలకు సమాధానం చెప్పాలి.

– యన్నం విజయలక్ష్మి, ఎంపీటీసీ, బండ్లమూడి

గ్రామీణ మహిళలే అధికం



చీమకుర్తి మండలంలో అధిక సంఖ్యలో మహిళలు గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలుచేస్తే వారికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ హామీ ఇచ్చేటప్పుడు ఆచరణ సాధ్యమా.. అసాధ్యమా అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచేందుకు అబద్ధపు హామీలిచ్చి సీఎం పీఠంపై కూర్చున్న తర్వాత ఇప్పుడు.. హామీలు చూస్తుంటే భయమేస్తోందంటే ఎలా..? ఉచిత బస్సు ప్రయాణం తక్షణమే అమలు చేయాలి.

– బొజ్జ విమలమ్మ, పడమటినాయుడుపాలెం

ఉచిత బస్సు హామీ అమలు చేయరా.?



కూటమి నేతల మాటలు నమ్మి మహిళలు ఓట్లేశారు. ఇప్పుడు మాట తప్పుతున్నారు. హామీ అమలుకు కనీసం కసరత్తు చేస్తున్నట్లు కూడా కనిపించడం లేదు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కలగానే కనిపిస్తోంది. మహిళలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి.

– మక్కెన కమలమ్మ, పులికొండ

బడిబయట పిల్లలను గుర్తించాలి

- గుంటూరు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి.లింగేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, విద్యాశాఖ అధికారులు

ఒంగోలు సిటీ: బడిబయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని గుంటూరు ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం ఒంగోలు స్పందన మీటింగ్ హాల్‌లో ఉపవిద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో పాఠశాల విద్యా కార్యక్రమాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ వరుసగా 30 రోజులు బడికి రాని విద్యార్థులను డ్రాప్స్ జాబితాలో పెట్టాలన్నారు. బాలబాలికలు డ్రాప్‌అవుట్ కాకుండా తరచుగా బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి బడికి వచ్చేటట్లు చేయాలన్నారు. పాఠశాలలోని హాజరు రిజిస్టర్లలోని విద్యార్థుల సంఖ్యకు, యుడైస్ సైట్‌లోని విద్యార్థుల సంఖ్యకు సరిపోయేటట్లు చూడాలని సూచించారు. పదో తరగతి విద్యార్థుల హాజరు 75 శాతం ఉండాలన్నారు. తరచుగా పాఠశాలకు రాని వారిని పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే వరకు ఉంచడం వల్ల ఇప్పటికీ 604 మంది పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించకుండా బీఎస్ఈ సైట్‌లో కనబడుతున్నారన్నారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల్లో బొగస్‌రోల్ ఉంటే రేపు సాయంత్రం లోపల తొలగించాలన్నారు. మండల విద్యాశాఖాధికారులు తమ మండల పరిధిలోని అన్ని స్కూల్ కాంప్లెక్స్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల బోగస్‌రోల్ పై తగు చర్యలు తీసుకోవాలన్నారు. పాల్ ల్యాబ్ పాఠశాలల పనితీరు పరిశీలించి పురోగతి సాధించేటట్లుగా చూడాలని సూచించారు. గత నెలలో నాగులుప్పలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించానని, అయినా ఈ రోజుకీ పాల్‌ల్యాబ్ పనితీరు 0.04 శాతం ఉందని చెప్పారు. మండల విద్యాశాఖాధికారి తగిన పురోగతి సాధించలేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, అనంతరం మండల విద్యాశాఖాధికారుల సస్పెన్షన్‌కు ప్రపోజల్స్ పంపించాలని డీఈఓ కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయునిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. టీచ్ టూల్ అబ్జర్వేషన్ వారికి నిర్దేశించిన ప్రకారం అబ్జర్వేషన్ పూర్తి చేయాలని, చేయని వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పాఠశాలలకు గతంలో ఆట స్థలానికి రూ.5 లక్షలు మంజూరు చేశారని, త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కెమిస్ట్రీ ల్యాబ్ కూడా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజన హాజరు సక్రమంగా వేయాలని, బోగస్‌రోల్ వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి అత్తోట కిరణ్‌కుమార్, డీసీఈబీ సెక్రటరీ శ్రీనివాసరావు, ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు, స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, స్పెషలాఫీసర్ వరకుమార్



సంతనూతలపాడు: రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

సంతనూతలపాడు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల భూ సమస్యలు చాలా మేరకు పరిష్కంచబడతాయని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, సంతనూతలపాడు మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్.వరకుమార్ వెల్లడించారు. సంతనూతలపాడు మండలం చంద్రపాలెం, బొడ్డువారిపాలెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో స్పెషల్ ఆఫీసర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సంతనూతలపాడు తహసీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి పర్యవేక్షించగా, రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ కోరారు. రైతులతో ప్రత్యేకంగా భూ సమస్యలపై స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ సమీక్షించారు. చంద్రపాలెం గ్రామంలో రైతుల నుంచి 26 అర్జీలు అందాయి. బొడ్డువారిపాలెం గ్రామంలో 9 అర్జీలు వచ్చాయి. పట్టాదారు పాసు పుస్తకాలు, సర్వే కొలతల కోసం అధికంగా అర్జీలు దాఖలయ్యాయి. కార్యక్రమంలో చంద్రపాలెం, బొడ్డువారిపాలెం సర్పంచులు బొడ్డు రామారావు, టి.వెంకటరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ఎస్.కె మాబుసుభానీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.రామ్‌తేజ్, వీఆర్వో ఎం.శ్రీనివాసులు, సర్వేయర్లు ప్రవీణ్, ఇమామ్ ఖాసిం, మౌనిక, స్వాతి, టీడీపీ నాయకులు బొడ్డు వెంకటేశ్వర్లు, బెజవాడ హరిబాబు, పాతూరి రాంబాబు, రావులపల్లి సుబ్బారావు, మండల ఎండోమెంట్ ఇన్‌చార్జ్ మద్దినేని శ్రీనివాసరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: రైతులను ఎప్పటి నుంచో వెంటాడుతున్న భూ సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ సదస్సుల ప్రత్యేక అధికారి పరిశుద్ధరావు తెలిపారు. కొత్తపట్నం మండలంలోని కె.పల్లెపాలెం గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలో హెచ్చుతగ్గులు, పాసుపుస్తకాల్లో పేర్లలో తప్పులు, ఆన్‌లైన్ సమస్యలన్నింటినీ రెవెన్యూ సదస్సులో పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి అర్జీని తప్పనిసరిగా పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే ఆలూరు, గాదెపాలెం, వజ్జిరెడ్డిపాలెం, గమళ్లపాలెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయని అన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీకృష్ణ, ఆర్ఐ వరప్రసాద్‌రావు, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మైనంపాడు డైట్ విద్యార్థులు



విద్యార్థులకు సర్టిఫికెట్ అందిస్తున్న విజయరామరాజు

సంతనూతలపాడు: కళా ఉత్సవ్ పోటీల్లో జాతీయ స్థాయి పోటీలకు జిల్లా ఫోక్ డ్యాన్స్ జట్టు ఎంపికైంది. జిల్లా స్థాయి పోటీల్లో సత్తాచాటిన మైనంపాడు డైట్ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బుధవారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభచూపి ఐఏఎస్ విజయరామరాజు చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. తద్వారా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు, సిబ్బంది అభినందించారు.

అందుబాటులో కార్పొరేట్ వైద్యం



మెడికేర్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర, డాక్టర్లు

ఒంగోలు టౌన్: నిరుపేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్య సేవలు అందించనున్నట్లు మెడిక్యూర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డా.శ్రీధర్‌బాబు, డాక్టర్ శ్రీనాథ్ తెలిపారు. నగరంలోని రాంనగర్ 4వ లైనులో నూతనంగా ఏర్పాటు చేసిన మెడిక్యూర్ హాస్పిటల్‌ను బుధవారం ప్రారంభించిన నేపథ్యంలో మీడియాతో ఆస్పత్రి డాక్టర్లు మాట్లాడారు. తమ వైద్యశాలలో స్త్రీలకు ప్రసూతి, సంతాన సాఫల్య వైద్యసేవలు, బరువు తక్కువగా పుట్టిన పిల్లలకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్డియాలజీ, ఆర్థోపెడిక్ విభాగాలలో అత్యంత ఆధునిక వైద్య పరికరాలతో, అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించనున్నట్లు వివరించారు. అతిథులుగా హాజరై హాస్పిటల్‌ను ప్రారంభించిన ఒంగోలు, కనిగిరి, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, బీఎన్ విజయకుమార్, తదితరులు మాట్లాడుతూ ఎంతో అనుభవం కలిగిన వైద్యుల పర్యవేక్షణలో మెడిక్యూర్ ఆస్పత్రిని ప్రారంభించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఒంగోలు నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, ప్రముఖ వైద్యులు జాలాది మణిబాబు, వీరయ్య చౌదరి, ఉమాపతి చౌదరి, ప్రకాష్ చావల, కాపా అనిల్ కుమార్, ప్రణీత్, వంశీ, మాలకొండారెడ్డి, రంగసాయి, కార్పొరేటర్ గోపి, పామూరు ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, డాక్టర్ రవళి, డాక్టర్ జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

సాయినాథునికి పుష్పయాగం



పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: షిరిడీ సాయి కల్చరల్ మిషన్ ఆధ్వర్యంలో స్థానిక లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో 34వ వార్షిక వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం ఏడు గంటలకు ఆలయ అర్చకులు షిరిడీ సాయినాథునికి, దత్తాత్రేయునికి పంచామృతాలతో రుద్రాభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పూలతో అలంకరణ చేసి స్వామివారి అష్టోత్తర శతనామాలతో శాస్త్రోక్తంగా పుష్పయాగం నిర్వహించారు.

పుష్పయాగానికి ఉభయ దాతలుగా గౌతమి ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీరాముల పెద్ద అంకయ్య చౌదరి, వెంకట రవణమ్మ దంపతులు వ్యవహరించారు. పుష్పయాగ పూజా క్రతువుల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు, షిరిడీ సాయి కల్చరల్ మిషన్ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రైతు ధర్నాను విజయవంతం చేయండి

- నేడు ఒంగోలులో ధర్నాకు అన్నదాతలు, పార్టీ శ్రేణులు తరలిరండి
- పార్టీ మండల కన్వీనర్ల పిలుపు

సంతనూతలపాడు/చీమకుర్తి రూరల్/మద్దిపాడు: అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం ఒంగోలులో నిర్వహించనున్న ధర్నాలో సంతనూతలపాడు నియోజకవర్గంలోని మండలాల నుంచి అత్యధిక సంఖ్యలో రైతులు, పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని పార్టీ సంతనూతలపాడు, చీమకుర్తి రూరల్, మద్దిపాడు మండలాల కన్వీనర్లు దుంపా చెంచిరెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, మండవ అప్పారావు పిలుపునిచ్చారు. గురువారం విడివిడిగా వారు ప్రకటనలు విడుదల చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ 6 హామీలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. రైతులకు ఇచ్చిన ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం హామీ అమలు చేయకపోవడం వలన అన్నదాతలు పంట సాగు చేసేందుకు పెట్టుబడి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదేవిధంగా రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలని, పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో దళారీ వ్యవస్థను నిర్మూలించాలని, తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వివిధ పంటల్లో తేమ లెక్కలతో ప్రభుత్వమే రైతులను ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాదిరిగానే రైతులకు ఆర్థిక భారం లేకుండా ఉచిత పంటల బీమా అమలు చేయాలన్నారు. బీమా ప్రీమియం నగదును రైతుల పక్షాన ప్రభుత్వమే చెల్లించాలన్నారు. రైతులపై అదనపు భారం మోపే చర్యలు మానుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు. రైతు సంక్షేమం కోసం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒంగోలులో నేడు ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ధర్నాలో రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పార్టీ మండలాల కన్వీనర్లు కోరారు.

మోదీ, చంద్రబాబు పాలనలు రిజర్వేషన్లకు వ్యతిరేకం



సమావేశంలో మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

చీమకుర్తి: కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని చంద్రబాబు పాలనలు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉన్నాయని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు అన్నారు. గురువారం చీమకుర్తిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకి ఎస్సీ వర్గీకరణపై ఉన్న శ్రద్ధ ఎస్సీల సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేయడంలో లేదన్నారు. అందుకే బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల అణచివేత కుట్రలో భాగంగానే మనువాద కుట్రలను తీసుకొస్తున్నారని, అందులో భాగంగానే వర్గీకరణ పేరుతో దళితులను విభజిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కిరణ్, మోహన్‌రావు, రవి, నారాయణ, యోగయ్య పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను అల్లుకున్న పిచ్చిచెట్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

చీమకుర్తి రూరల్: ఒంగోలు–కర్నూలు రోడ్డుపై చీమకుర్తి మండలంలోని చీమలమర్రి వద్ద విద్యుత్ స్తంభాలకు పిచ్చిచెట్ల తీగలు పూర్తిగా అల్లుకుని ప్రమాదకరంగా ఉండటంతో పాటు పెనుగాలుల సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దీనిపై సాక్షి దినపత్రికలో ఈ నెల 12వ తేదీ 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఉదయం ఆయా విద్యుత్ స్తంభాలను అల్లుకున్న పిచ్చిచెట్లు, తీగలను తొలగించారు. అదేవిధంగా మంచికలపాడు సచివాలయం పరిధిలో ఎనర్జీ అసిస్టెంట్, జూనియర్ లైన్‌మేన్ గ్రేడ్–2ను విద్యుత్ శాఖ ఎస్ఈ నియమించారని విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.మోహనరావు తెలిపారు.



పిచ్చి మొక్కలు, తీగలను తొలగించిన అనంతరం విద్యుత్ స్తంభాలు

పురుగు, తెగుళ్ల నివారణకు చర్యలు

ఒంగోలు సిటీ: పురుగు, తెగుళ్ల నివారణకు తప్పనిసరిగా యాంత్రిక పద్ధతిలో చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి జి.కిషోర్‌బాబు సూచించారు. గురువారం ఒంగోలు మండలంలోని రాష్ట్రీయ కృషి విజ్ఞాన కేంద్రంలో రాఫ్తార్ పథకం కింద రైతులకు పంటల సాగులో మెళకువలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ సమన్వయకర్త రామమోహనరావు మాట్లాడుతూ రైతులకు ఎరువుల యాజమాన్యం, మినుము, శనగ పంటలలో పురుగు, తెగుళ్ల నివారణకు యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకుడు వెంకటరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు, విత్తన శుద్ధి వలన ఉపయోగాలను రైతులకు వివరించారు. ఏవో శైలజ పంటలలో పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి రామకృష్ణారెడ్డి, వ్యవసాయ సహాయకులు రవిచంద్ర, హిమబిందు, రైతులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ మోడల్ టెస్ట్ పేపర్ల ఆవిష్కరణ



మోడల్ టెస్టు పేపర్లు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కార్యాలయంలో గురువారం ఎస్ఎస్‌సీ మోడల్ టెస్ట్ పేపర్లు ఆవిష్కరించారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాడటమే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కూడా యూటీఎఫ్ ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ క్రమంలో ప్రతిఏటా ఎస్ఎస్‌సీ విద్యార్థులకు ఉపయోగపడేవిధంగా టెస్టు పేపర్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. టెస్టు పేపర్ల రూపకల్పనలో మంచి నైపుణ్యం, బోధనానుభవం కలిగిన ఉపాధ్యాయులు నిజాయితీగా పనిచేస్తున్నారని చెప్పారు. అతి తక్కువ ధరలకు తెలుగు, ఇంగ్లిషు మాధ్యమాలలో టెస్టు పేపర్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ మెడల్ పేపర్ల నుంచి ప్రతి ఏటా 70 నుంచి 85 శాతం ప్రశ్నలు వస్తున్నాయని, గ్రామీణ విద్యార్థులకు, వెనుకబడిన విద్యార్థులకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. సమాజం పట్ల బాధ్యత కలిగిన విద్యార్థులను తయారు చేసేందుకు యూటీఎఫ్ కృషి చేస్తోందన్నారు. జిల్లాలో కొన్ని మండల శాఖల ద్వారా జెడ్పీ హైస్కూళ్లు, కేజీబీవీ, సోషల్ వెల్ఫేర్‌లో చదువుతున్న విద్యార్థులకు మోడల్ పేపర్లను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.వీరాంజనేయులు తెలిపారు. కేవలం విద్యారంగంలోనే కాకుండా ప్రతి రెండు నెలలకోసారి దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ 1600 మందికి పైగా నిరుపేద రోగులకు బీపీ, సుగర్, పక్షవాతం, మూర్ఛ వంటి వ్యాధులకు వైద్య చికిత్స అందజేస్తున్నట్లు తెలిపారు. గతేడాది జరిగిన పదో తరగతి పరీక్షలలో యూటీఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లు చదివిన విద్యార్థులు 80 శాతానికిపైగా మార్కులు సాధించారని జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రవి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు జి.ఉమామహేశ్వరి, ఎస్.చిన్నాస్వామి, ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌వీ కొండారెడ్డి, వై.వెంకటరావు, ఆర్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.